# State Visit of President of Egypt to India (January 24-26, 2023)

January 21, 2023

# భారత్‌లో ఈజిప్ట్ అధ్యక్షుడి అధికారిక పర్యటన (జనవరి 24-26, 2023)

జనవరి 21, 2023

1. ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ ఆహ్వానం మేరకు అరబ్ రిపబ్లిక్ ఆఫ్ ఈజిప్ట్ అధ్యక్షుడు గౌరవనీయ అబ్దెల్ ఫతహ్ ఎల్-సిసి 2023 జనవరి 24-26 తేదీల్లో భారత్‌లో అధికారికంగా పర్యటిస్తారు. భారత్‌లో ఆయన అధికారికంగా పర్యటించడం ఇది రెండోసారి. ఈ సందర్భంగా ఆయన 74వ భారత గణతంత్ర దినోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొంటారు. అయిదుగురు మంత్రులు మరియు సీనియర్ అధికారులతో పాటు అధ్యక్షుడు సిసితో అత్యున్నత స్థాయి బృందం కూడా వస్తుంది. షెడ్యూల్ ప్రకారం 2023 జనవరి 24న ఆయన న్యూఢిల్లీకి చేరుకుంటారు.

2. 3వ ఇండియా ఆఫ్రికా ఫోరమ్ సదస్సులో పాల్గొనేందుకు 2015 అక్టోబర్‌లో ఒకసారి అధ్యక్షుడు సిసి భారత్ వచ్చారు. అలాగే 2016 సెప్టెంబర్‌లో అధికారికంగా పర్యటించారు. మన గణతంత్ర దినోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొనాలంటూ అరబ్ రిపబ్లిక్ ఆఫ్ ఈజిప్ట్ అధ్యక్షుడిని ఆహ్వానించడం ఇదే తొలిసారి. ఈజిప్షియన్ ఆర్మీకి చెందిన మిలిటరీ బలగాలు కూడా రిపబ్లిక్ డే పెరేడ్‌లో పాల్గొంటాయి.

3. భారత్, ఈజిప్ట్ మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి ఈ ఏడాదితో 75 ఏళ్లు అవుతాయి. 2022-23లో జీ-20కి అధ్యక్ష దేశంగా భారత్ వ్యవహరిస్తున్న తరుణంలో ఈజిప్ట్ 'అతిథి దేశం'గా కూడా ఆహ్వానించబడింది.

4. 2023 జనవరి 25న రాష్ట్రపతి భవన్‌లో అధ్యక్షుడు సిసికి సాదర స్వాగతం పలకనున్నారు. అదే రోజు సాయంత్రం ఆయనకు గౌరవసూచకంగా గౌరవనీయ రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము అధికారిక విందు నిర్వహిస్తారు. ఇరు దేశాల ప్రయోజనాలు ఇమిడి ఉన్న ద్వైపాక్షిక, ప్రాంతీయ మరియు అంతర్జాతీయ అంశాలపై ప్రధానితో అధ్యక్షుడు సిసి ద్వైపాక్షిక సమావేశం మరియు బృంద స్థాయి చర్చలు జరపనున్నారు. అధ్యక్షుడు సిసితో విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి డా. ఎస్ జైశంకర్ భేటీ అవుతారు.

పర్యటన సందర్భంగా అధ్యక్షుడు సిసి అదే రోజున ఒక వ్యాపార కార్యక్రమంలో భారతీయ వ్యాపార కమ్యూనిటీతో కూడా సమావేశమవుతారు.

5. నాగరికత, సాంస్కృతిక, ఆర్థికపరమైన బంధాలు మరియు ప్రజల మధ్య విడదీయలేని సంబంధాల కారణంగా భారత్ మరియు ఈజిప్ట్ మధ్య సుహృద్భావ మరియు స్నేహపూర్వక సంబంధాలు ఉన్నాయి. ఇరు దేశాల మధ్య బహుముఖ సంబంధాలకు ఉమ్మడి సాంస్కృతిక విలువలు, ఆర్థిక వృద్ధి తోడ్పాటుకు కట్టుబడి ఉండటం, రక్షణ మరియు భద్రత రంగాల్లో సహకారం, అలాగే ప్రాంతీయ మరియు అంతర్జాతీయ అంశాల్లో ఏకాభిప్రాయం వంటి అంశాలు ప్రాతిపదికగా ఉన్నాయి. ఇరు దేశాలు బహుళపక్ష మరియు అంతర్జాతీయ వేదికల్లో కలిసి పనిచేస్తున్నాయి.

6. భారత్ మరియు ఈజిప్ట్ మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం 2021-22 ఆర్థిక సంవత్సరంలో రికార్డు స్థాయిలో 7.26 బిలియన్ డాలర్లకు చేరింది. వాణిజ్య వ్యవహారాల్లో సముచితమైన సమతౌల్యం నెలకొంది. భారత్ నుంచి ఈజిప్టుకు ఎగుమతులు 3.74 బిలియన్ డాలర్లుగా ఉండగా, ఈజిప్టు నుంచి భారత్‌కు దిగుమతులు 3.52 బిలియన్ డాలర్లకు చేరాయి. 50కి పైగా భారతీయ కంపెనీలు ఈజిప్ట్ ఎకానమీలోని రసాయనాలు, ఎనర్జీ, టెక్స్‌టైల్, గార్మెంట్, అగ్రి-బిజినెస్, రిటైల్ వంటి వివిధ రంగాల్లో దాదాపు 3.15 బిలియన్ డాలర్లను ఇన్వెస్ట్ చేశాయి.

7. సవాళ్లకు ఎదురు నిల్చిన భారత్ మరియు ఈజిప్ట్ మధ్య సంబంధాలు మరింత పటిష్టమయ్యేందుకు అధ్యక్షుడు సిసి పర్యటన దోహదపడగలదని ఆశాభావం నెలకొంది.

**న్యూఢిల్లీ**

**జనవరి 21, 2023**

DISCLAIMER: This is an approximate translation. The original is available in English on MEA's website and may be referred to as the official press release.